నేను యూనివర్శిటీలో చదువుతున్న రోజుల్లో ఒక సంఘటన జరిగింది. డబ్బు పలుకుబడీ పుష్కలంగా వున్న ముగ్గురు కుర్రాళ్ళు ఒకనాటి రాత్రి యూనివర్శిటీ కాంపస్‌లోనే ఒకమ్మాయిని చెరిచారు. మర్నాడు పోలీసులొచ్చారు; వెళ్ళారు; పత్రికల వాళ్ళొచ్చారు, ఫొటోలు తీసుకున్నారు. ఇంటర్వ్యూలు చేశారు. వార్త గుప్పుమంది. విశ్వవిద్యాలయ ఆవరణలోనే ఇలాంటి ఘాతుకమా అని అంతా ముక్కు మీద వేలసుకున్నారు. రాజకీయ పార్టీల నాయకులూ, విద్యా సంఘాల వారూ, మహిళా సంఘాల వారూ ఈ దారుణాన్ని తీవ్రంగా ఖండించారు. నిందితుల్ని వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసులు మళ్ళీ వచ్చారు, వెళ్ళారు. ఇటువంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకుంటామని వైస్ ఛాన్సలర్ హామీ ఇచ్చాడు. అంతే. అంతకుమించి మరేమీ జరగలేదు. ఆ తరుణంలో పుష్పలత రంగంలోకి దిగింది.

ఎక్కణ్ణించి ఎలా కూడగట్టుకొచ్చిందో గాని అయిదారువేల మంది ఆడవాళ్లను తెచ్చి యూనివర్శిటీ ముందు పెద్ద ప్రదర్శన జరిపింది. దోషులయిన విద్యార్థులు ముగ్గుర్నీ వెంటనే డిస్మిస్ చెయ్యాలనీ, వాళ్ళని అరెస్టు చేసి కేసు పెట్టాలనీ కోరుతూ నినాదాలిచ్చింది. పోలీసులు లంచాలు తిన్నారనీ, వైస్ ఛాన్సలరూ, రిజిస్ట్రారూ రాజకీయ పలుకుబడికి లొంగిపోయారనీ ఆరోపణలు చేసింది. అంతటితో ఆగలేదు. దోషుల్ని శిక్షించేవరకు ఆందోళన ఆపేది లేదంటూ వైస్ ఛాన్సలర్ ఇంటిముందు ఏకబిగిన వారం రోజుల పాటు నిరాహార దీక్ష జరిపింది.

మొదట్లో అంతగా పట్టించుకోకపోయినా, క్రమంగా కొన్ని రాజకీయ పార్టీలూ, విద్యార్థి, మహిళా సంఘాలూ పుష్పలతకి మద్దతు ప్రకటించాయి. ఆమెతో పాటు మరికొందరు మహిళలు కూడా నిరాహారదీక్ష చేపట్టారు. పుష్పలత ఫొటోలూ, ఆమెతో ఇంటర్వ్యూలూ అచ్చు వేసి, పత్రికలు మంచి ప్రచారం ఇచ్చాయి. నిరాహారదీక్షా శిబిరంలో రెండుమూడు సార్లు నేను పుష్పలతని కలిశాను. అయిదారురోజుల తర్వాత కొంచెం నీరసంగా కనిపించింది గాని, అన్నాళ్ళు ఆహారం తీసుకోని దానిలా అనిపించలేదు. అది కేవలం నా అనుమానమే కావచ్చు.

చివరికి పుష్పలత గెలిచింది. ఆ కుర్రాళ్ళు ముగ్గుర్నీ యూనివర్శిటీ నుంచి డిస్మిస్ చేశారు. పోలీసులు వాళ్ళని అరెస్టు చేసి కేసు పెట్టారు. ఆ కేసు ఆ తర్వాత కోర్టులో ఎలా తేలిపోయిందన్నది వేరే కథ. మహిళా సంక్షేమ శాఖ మంత్రిణి వచ్చి, బత్తాయి రసం ఇచ్చి పుష్పలత చేత నిరాహార దీక్ష విరమింపచేసింది. పుష్పలత రాజకీయం జీవితంలో ఇది తొలి విజయం. ఆ తర్వాత కొద్ది రోజులకే ఆమె అధికార పార్టీకి చెందిన మహిళా విభాగానికి కన్వీనర్ అయింది

* * *

